జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నేతలు

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జిఒ

టిడిపి ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే ప్రభుత్వం జిఒ 1ను జారీ చేసిందని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. బుధవారం సాయంత్రం మొగల్తూరులో టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వం జారీ చేసిన జిఒ ప్రతులను నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ప్రదర్శన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి భయపడే జిఒ జారీ చేశారని విమర్శించారు. జిఒను ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వ అధినేతలను ప్రజలు కాలర్ పట్టుకునే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పొత్తూరి రామరాజు, కత్తిమండ ముత్యాలరావు, సత్తినేని మోహన్‌రావు, కలిదిండి కుమార్ బాబు పాల్గొన్నారు.

4 ఒహెచ్‌బిలు మంజూరు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న వాటర్‌గ్రిడ్ పథకంలో భాగంగా భీమవరం, వీరవాసరం మండలాలకు సంబంధించి నాలుగు ఒహెచ్‌బిలు (ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు) మంజూరయ్యాయని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నరసాపురంలో శంకుస్థాపన కూడా చేశారన్నారు. గోదావరి నుంచి నేరుగా పైపుల ద్వారా నీటిని చెరువులకు మళ్లించి అక్కడినుండి ఒహెచ్‌బిలకు ఫిల్టర్ చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా భీమవరం మండలంలో రెండు, వీరవాసరం మండలంలో రెండు ఒహెచ్‌బిలను నిర్మించేందుకు స్థలాలను గుర్తిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిఇ కె.ధనంజయ, జెఇ కనకరావు పాల్గొన్నారు.

జోగయ్యను పరామర్శిస్తున్న ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు

జోగయ్యకు అంగర పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు కాపు ఉద్యమ నాయకులు చేగొండి హరిరామ జోగయ్యను బుధవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వయసులో కూడా నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాటం చేయడం అందరూ అభినందించదగ్గ విషయమన్నారు. ఆయన పోరాటాన్ని అణిచివేయాలన్న జగన్ ప్రభుత్వ తీరు బాధాకరమన్నారు. పవన్ కళ్యాణ్ మాటతో దీక్షను విరమించడం సంతోషకరమన్నారు.

'రానున్నది టిడిపి ప్రభుత్వమే'

ప్రజాశక్తి - మొగల్తూరు

భవిష్యత్తులో రానున్నది టిడిపి ప్రభుత్వమేనని శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. బుధవారం మొగల్తూరు జిఎన్ఆర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొత్తూరు రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణి అవలంబిస్తోందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జిఒను ఇప్పుడు తిరిగి తీసుకురావడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో కత్తిమండ ముత్యాలరావు, సత్యనేని మోహన్‌రావు, జోగి పండు, కలిదిండి కుమార్‌బాబు, అంద్రజు రామన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి బాపూజీ

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన నూతన సాంకేతిక విధానాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమణి బాపూజీ సూచించారు. కాళీపట్నం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నీటితిప్ప, జగన్నాథపురం ,పాతపాడు, కాళీపట్నం ఓరియంటల్ హైస్కూల్లోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఇఒ పుష్పరాజ్యం, సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ, వైస్ ఎంపిపి కవురు సీతామాలక్ష్మి సుబ్రహ్మణ్యం, సొసైటీ ఛైర్ పర్సన్ దొంగ నాగమణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌చే ఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, సంఘ సభ్యులు స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు కష్టపడి పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా జిల్లా ఎన్‌జిఒ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం కార్యదర్శి నెరుసు రామారావు, కార్యవర్గ సభ్యులు, జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్‌ఎస్ హరనాథ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వెళ్లేందుకు దారేది..!

దారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి
రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రామంలో సకినేటిపల్లి వారి వీధిలో రాకపోకలకు భవన నిర్మాణ మెటీరియల్, వ్యర్థాలు అవరోధాలుగా మారాయి. గత కొద్ది రోజులుగా ఈ వీధిలో భవన నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. దీంతో అవసరమైన మెటీరియల్‌తో పాటు అవసరం వ్యర్థాలను కూడా దారికి అడ్డంగా వేయడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేమని అడిగితే పంచాయతీ మార్గం మా ఇష్టమంటూ వారు సమాధానం చెబుతున్నారు. ఈ అడ్డంకుల వల్ల ఇంటింటికీ రేషన్ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రేషన్ సరుకులు లబ్ధిదారుల ఇంటికి చేరే పరిస్థితి లేదు. ఒక పక్క వీధి ఆక్రమణలకు గురవ్వడం, మరో పక్క వ్యర్థాలతో ఈ వీధి గుండా కనీసం చిన్న వాహనాలు కూడా రాకపోకలు సాగించలేని స్థితిలో అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ అడ్డంకుల వల్ల స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు, గ్యాస్, తాగునీరు సరఫరా చేసే వాహనాలు రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో అనేక కుటుంబాలు తమ నిత్యావసరాలు తెచ్చుకోవడానికి ఈ అడ్డంకులు అవరోధాలుగా మారాయని ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గాన్ని ఆధారం చేసుకుని రాకపోకలు సాగిస్తున్న వృద్ధులు, అనారోగ్యపాలైన వారు ఈ అడ్డంకుల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందిగా మారిన అడ్డంకులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సకినేటిపల్లివారి వీధిలో రోడ్డుకు అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

జివిఆర్ సేవలు ఎనలేనివి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ మాజీ ఛైర్మన్, సేవాతత్పరుడు, వైసిపి నాయకులు గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) వర్ధంతిని బుధవారం నిర్వహించారు. బుధవారం మార్కెట్‌లో జివిఆర్ విగ్రహానికి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. గ్రంధి వెంకటేశ్వరరావు మున్సిపల్ ఛైర్మన్‌గా పట్టణానికి అనేక సేవలందించారన్నారు. రాజకీయాల్లో ముక్కు సూటిగా వ్యవహరించేవారని తెలిపారు. ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిస్తే వెంటనే వారి వద్దకెళ్లి అండగా నిలిచేవారని, రాజకీయాల్లో సరికొత్త కోణాన్ని ఆయన ఆవిష్కరించారని పేర్కొన్నారు. పట్టణ ప్రజల గుండెల్లో జివిఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. పదవులకు న్యాయం చేసిన మహోన్నత వ్యక్తి గ్రంధి వెంకటేశ్వరరావు అని పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కామాక్షి అమ్మవారి దేవస్థానంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, సోమేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ కోడే విజయలక్ష్మి యుగంధర్, ఎఎంసి మాజీ ఛైర్మన్లు తిరుమాని ఏడుకొండలు, ఎస్.రాజు, తోట భోగయ్య, గూడూరి ఉమాబాల, కొప్పుల సత్తిబాబు, నల్లం రాంబాబు, కామన నాగేశ్వరరావు, పేరిచర్ల సత్యనారాయణ రాజు, రామాయణం సత్యనారాయణ, రామాయణం గోవింద్, టి.ఏడుకొండలు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

మూడు నెలలకోసారి గ్రామ సభ నిర్వహించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మూడు నెలలకోసారి గ్రామ సభ నిర్వహించాలని డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు అన్నారు. పెనుమంట్ర పంచాయతీ గ్రామ సభ సర్పంచి తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన బుధవారం జరిగింది. అనంతరం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిఎల్‌డిఒ సచివాలయ ఉద్యోగుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గతంలో ఆరు నెలలకు ఒకసారి జరిగే గ్రామసభ జగన్ పరిపాలనలో మూడు నెలలకు ఒకసారి జరపాలని సూచించారు. ఈ గ్రామ సభలకు గ్రామ పరిధిలో ఉండే ప్రతి శాఖకు సంబంధించి సిబ్బంది హాజరు కావాలన్నారు. వారి దృష్టికొచ్చిన ప్రతి సమస్యనూ వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అప్పుడే స్థానిక సమస్యలు పరిష్కారమవుతాయని, గ్రామ అభివృద్ధి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.పూర్ణ బాబ్జి, ఉపసర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, ఎంపిటిసి-2 గండి రామారావు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు , సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ అప్పారావు

దళితుల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

దళితుల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. కొడమంచిలి పంచాయతీ పరిధి తీర్థాలపుంత, టి.మెరక, బిపి చెరువు ఏరియాలో 109వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీర్థాలపుంతలో ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా సిఎం జగన్ పని చేస్తున్నారని తెలిపారు. దళితులంతా సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా నిలబెట్టాలనేదే సిఎం లక్ష్యమన్నారు. అరుంధతీపేట అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. టి.మెరకలో సుమారు 130 ఇళ్ల స్థలాలను ఎస్‌సి సాయాజిక వర్గానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఎఎంసి ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఎంపిపి చంటి రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి చంటిరాజు అధ్యక్షత వహించారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శృంగవృక్షం, గొరగనమూడు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ శాఖలతో నిర్వహించిన సమీక్షలో పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్య మాట్లాడుతూ జనవరి 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మోగల్లు, శృంగవృక్షం గ్రామాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులను కోరారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎస్.నరేష్, లక్ష్మీ తులసి, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీరాజ్ ఎఇ విజయ్ కుమార్‌రాజు, ఆర్అండ్‌బి ఎఇ ఎం.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విస్తరణ అధికారి రెడ్డియ్య

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మోటార్ సైకిల్ అదుపుతప్పి పంట బోదెలో పడిపోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన వెలగలేరు తలుపులమ్మ గుడి ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన జుత్తిగ వెంకట దుర్గారావు (63) ఆలమూరు రెడ్డి అండ్ రెడ్డి షో రూమ్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 5.40 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి ఆలమూరు బయలుదేరారు. వెలగలేరు తలుపులమ్మ గుడి వద్దకు వచ్చేసరికి బండి అదుపుతప్పి పంట బోదెలోకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించి కొడుకు శివ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తొలగించిన రేషన్‌కార్డులను పునరుద్ధరించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఏ వార్డుకు వెళ్లినా రేషన్ కార్డులు, పింఛన్లు తీసేశారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ఇప్పటికైనా జగన్ తన తప్పు తెలుసుకొని పింఛన్లు పునరుద్ధరించాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 11వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని మాట్లాడారు. ప్రజలు పెరిగిన నిత్యావసర సరుకులతో విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఇప్పటికే టిడ్కో గృహాలు కేటాయించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఛాంబర్స్‌లో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నన్నయ్య విశ్వవిద్యాలయ కెమిస్ట్రీ ప్రొఫెసర్ బి.జగన్మోహన్ రెడ్డి లైఫ్ స్కిల్స్ అండ్ పర్సనాల్టీ డెవలప్మెంట్‌పై 3 నెలలు సర్టిఫికెట్ కోర్స్ బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ఉద్యోగం, వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వివిధ రకాల సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. అవి విద్యార్థి సర్వముఖాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కోర్సులను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు.

మాజీ కౌన్సిలర్ మారెమ్మ మృతి

ప్రజాశక్తి భీమవరం రూరల్

భీమవరం 18వ వార్డు మాజీ కౌన్సిలర్ (టిడిపి) ఉండి మారెమ్మ (45) మంగళవారం రాత్రి ఇంటివద్ద మరణించారు. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు నుండి టిడిపి అభ్యర్థినిగా పోటీచేసి కౌన్సిలర్‌గా గెలుపొందారు. కోటికలపూడి గోవిందరావు (చినబాబు) మున్సిపల్ ఛైర్మన్ కౌన్సిల్లో ఐదు సంవత్సరాల పాటు కౌన్సిలర్‌గా కొనసాగారు. ఆమె మృతికి టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, అంగన్వాడీ డ్వాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు సంతాపం తెలిపారు.


ఉండి: గాదిరాజు రంగరాజు మాస్టారును సత్కరిస్తున్న ఎంపిపి

మహనీయుడు లూయిస్ బ్రెయిలీ

ప్రజాశక్తి - ఉండి

అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఉండి మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణ రాజు (హరిబాబు) అన్నారు. బుధవారం ఉండి భవితా కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ లిపి దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కేంద్రం ప్రధానోపాధ్యాయిని చంద్రకళ అధ్యక్షత వహించారు. హరిబాబు మాట్లాడుతూ అంధులకు బ్రెయిలీ లిపి ఒక వరం అన్నారు. మహంకాళి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు మాట్లాడారు. అనంతరం గాదిరాజు రంగరాజు మాస్టార్‌ను ఎంపిపి హరిబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయని తబిత, సిబ్బంది నాగలక్ష్మి, వికలాంగులు పాల్గొన్నారు.

పోడూరు : అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ఉపాధ్యాయిని ఎస్.నాగమణి అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని పోడూరు భవితా కేంద్రంలో ఐఇఆర్‌పి గంగాధర్ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రెయిలీ 200వ జయంతి సందర్భంగా లూయిస్ బ్రెయిలీ ముఖచిత్రంతో 2009వ సంవత్సరంలో భారత ప్రభుత్వం విడుదల చేసిన రెండు రూపాయల నాణేలను, కన్ను ఆకారంలో ఏర్పరిచిన గోడపత్రికను అంధురాలైన ఉపాధ్యాయురాలు నాగమణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భవిత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - అత్తిలి

అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 5వ తేదీన పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ వివివి ఎస్.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌర శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొని 298 కొత్త పింఛన్లు, 167 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులతోపాటు ఆయా శాఖల అధికారులు సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ఘనంగా మహాజన సోషలిస్ట్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

మంద కృష్ణ ఏర్పాటుచేసిన మహాజన సోషలిస్ట్ పార్టీ ద్వారా రానున్న కాలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు అన్నారు. బుధవారం ఆచంట వేమవరం బస్టాండ్ వద్ద దిగమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోషలిస్ట్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పార్టీ పెట్టక ముందు ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ద్వారా ఆరోగ్యశ్రీని సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సభ్యులు చదలవాడ మనోహర్, కమిటీ సభ్యులు కొండేపూడి భాగ్యరాజు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉండాలని సూచించారు.

7 నుంచి లీడర్‌షిప్‌పై యువతకు శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 7, 8, 9 తేదీల్లో ట్రైనింగ్ ఆన్ యూత్ లీడర్షిప్ అండ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని పెనుమంట్ర బ్లాక్‌లోని పెనుగొండలోని విశ్వతేజ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు కామాక్షి రవి, కార్యదర్శి కె.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు జరిగే కార్యక్రమంలో యోగా, క్రీడలు, కమ్యూనిటీ విజిట్, స్వచ్ఛ సంకల్పం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకత్వ లక్షణాలపై శిక్షణ పొందడానికి పాల్గొన్న యువతీయువకులకు మూడు రోజుల శిక్షణ అనంతరం ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు.

ఎస్ఎన్ఎల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల, స్వయం ప్రతిపత్తిలో 2022-2023 గాను ఎంఎస్‌సి బోటనీ, ఎంఎస్‌సి ఆక్వాకల్చర్, ఎంకామ్‌లో చేరేందుకు స్పాటెడ్ అడ్మిషన్లు జరుతున్నట్లు ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల ఆఫీసు వద్ద ఈ నెల 5వ తేదీలోపు సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

నేడు ఆచంటలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట శ్రీరామేశ్వరస్వామి సత్రంలో ఈ నెల ఐదో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జగన్నాథరావు బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు. వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు విధిగా పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ఎఇ శ్రీనివాస్

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నట్లు ఇరిగేషన్ ఎఇ సల్లపూడి శ్రీనివాస్ తెలిపారు. వారం రోజుల క్రితం సాగునీటి సమస్యపై ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవ తీసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చుపారన్నారు. ప్రస్తుతం ముమ్మరంగా రైతులు నాట్లు వేస్తున్నారన్నారు. కాలువల్లో చెత్త, గుర్రపు డెక్క తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇకనుంచి సాగునీటి సమస్య తలెత్తకుండా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆయన తెలిపారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో

EP No.59/2019 in O.S. No. 153/2014

Between :
శ్రీ కొండేటి హనుమంతు .... డిక్రిహోల్డరు/ వాది
And
శ్రీమతి అంబటి గంగాజలం ... జడ్జిమెంటు డెటారు/ ప్రతివాది

పై నంబరు గ్రంథములో డిక్రి బాకి రాబట్టుకునే నిమిత్తం జడ్జిమెంట్ డెటారు/ ప్రతివాది సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.20.01.2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. ఎవరైననూ వేలం పాటలో పాల్గొని, స్థిరాస్తిని వేలంపాటలో పాడుకోవచ్చును. షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము : (పశ్చిమ గోదావరి జిల్లా) ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రారు యిలాకా గాలాయిగూడెం గ్రామంలో గల ఆర్.యస్.నెం.198/6 దాఖలా ఎ.1.00 (ఒక ఎకరం) మెరక భూమికి హద్దులు : **తూర్పు :** అంబటి గంగరాజు గారి భూమి, **దక్షిణం :** అంబటి గంగరాజు గారి భూమి, **పడమర :** పూజారి లక్ష్మణరావు గారి భూమి, **ఉత్తరం :** అంబటి గంగరాజు గారి భూమి.
ఈ హద్దుల మధ్య ఎ.1.00 మెరక భూమి వేలం వేయుదురు.
డిక్రి హోల్డరు విలువ రూ.10,00,000/-
ప్రభుత్వం వారి విలువ రూ.29,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

స్థలం : ఏలూరు — తేది : 04-01-2023

ఇట్లు :
ఈడ్పుగంటి శ్రీనివాస బాబు,
అట్లూరి రవికుమార్,
న్యాయవాదులు, ఏలూరు.

www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కాళ్ల

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని పెదఅమిరంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా వెల్లంపల్లి గ్రామానికి చెందిన నూతలపాటి వెంకటేశ్వరరావు(52) కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని మల్లేష్ మెరైన్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఫ్యాక్టరీ పనుల నిమిత్తం కొన్నిరోజులుగా భీమవరంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం కంపెనీ పనిపై ఆకివీడు వెళ్లి తిరిగి మోటార్‌సైకిల్‌పై భీమవరం బయలుదేరాడు. పెదఅమిరం వద్దకురాగానే వాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో భీమవరంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వెంకటేశ్వరరావు కుమారుడు వేణు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంకండి

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ పిలుపు

47 తీర్మానాలు ఆమోదం,

నూతన కమిటీ ఎన్నిక

భవిష్యత్ కార్యాచరణపై జాతీయ, రాష్ట్ర నాయకుల దిశానిర్దేశం

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ..

మార్చిలో చలో అసెంబ్లీకి పిలుపు

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐక్య ఉద్యమాలు విస్తృతం చేయాలని, భవిష్యత్తు పోరాటాలను ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలో కార్మిక నేతలకు భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ దిశానిర్దేశం చేసింది. మహాసభ చివరిరోజు బుధవారం నూతన కమిటీని ఎన్నుకుంది. జాతీయ, రాష్ట్ర నాయకులు చేసిన సందేశాలు ప్రతినిధుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి.

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల రెండో తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ బుధవారంతో ముగిసింది. ఈ మహాసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై ప్రధానంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణకు మహాసభ దిశానిర్దేశం చేసింది. మహాసభకు హాజరైన సుమారు 800 మంది ప్రతినిధులు సంఘం పనితీరు, చేసిన ఉద్యమాలు, పోరాటాలు, రాబోయే కాలంలో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నారు. మహాసభ మొదటిరోజు సావిత్రమ్మ, టి.షడ్రక్ స్మారక నగర్ (శ్రీ అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపం) ఆవరణలో సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సిఐటియు జెండాను ఆవిష్కరించి మహాసభను ఘనంగా ప్రారంభించారు.

మహాసభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

అనంతరం అమరవీరుల స్తూపానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు హాజరైన ప్రతినిధులంతా నివాళులర్పించారు. సభకు హాజరైన నాయకులను సభా వేదికపైకి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ ఆహ్వానం పలకగా ఆహ్వాన సంఘం సహాధ్యక్షులు బి.బలరాం ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాసం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు రాష్ట్ర మహాసభకు ఎందరో మహానుభావులు నడయాడిన నేలపై కార్మిక ప్రతినిధులకు అతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ మహాసభ జరుగుతుందని, సంఘాలన్నీ మరింత శక్తివంతం చేసుకుని నిర్ణయాలు చేయాలని సూచించారు. కార్పొరేట్ కమ్యూనల్ పెట్టుబడిదారుల పాలన తిప్పికొట్టే విధంగా ముందుకు సాగాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేషు సౌహార్ధ్ర సందేశం ఇచ్చారు.

మహాసభకు హాజరైన ప్రతినిధులు

అబ్బురపరిచేలా ప్రదర్శన

సోమవారం మధ్యాహ్నం పాత బస్టాండ్ సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ వరకు భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్మిక ప్రతినిధులతోపాటు కార్మికులు ప్రదర్శనలో పాల్గొన్న తీరు ఎర్ర సముద్రాన్ని తలపించింది. కార్మిక దళం రాకతో పురవీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ మహాప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్న తీరు వర్ణనాతీతం. వ్యవసాయ కార్మిక సంఘం, యుటిఎఫ్, శ్రామిక మహిళ, ఐద్వా, బజారు లాగుడు బళ్లు, భవన నిర్మాణ కార్మికులతోపాటు అనేక సిఐటియు అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాలు మహా ప్రదర్శనకు అడుగడుగునా స్వాగతం పలికాయి. కేశవరావు హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కేరళ న్యాయ, పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ దేశంలో అనేక భాషలు, రకరకాల ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ పద్ధతులు ఉన్నప్పటికీ అంతా కలిసిమెలిసి జీవిస్తుండటం ఒక ప్రత్యేకతగా ఉందన్నారు. అలాంటి లౌకికతత్వానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ రూపంలో ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామిక లౌకిక దేశంగా ఉన్న భారతం హిందూదేశంగా మార్చాలని చూస్తుందన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలు గెలిపించారని చెప్పారు. భూపంపిణీ, నాణ్యమైన వైద్యం, విద్య వంటి విధానాలు కేరళలో అమలు చేశామన్నారు. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఇళ్ల వెంకటేశ్వరరావు, జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి ఈ బహిరంగ సభలో మాట్లాడారు. రెండో రోజు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్ రాష్ట్ర మహాసభలో కార్యకలాపాల నివేదికను ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా, వాటిని అమలు చేయాలని కోరుతున్న ఆయా తరగతుల కార్మికులపై నిర్బంధానికి పాల్పడుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తొలుత ఇటీవల కాలంలో మృతి చెందిన అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర నాయకులు, కరోనా విపత్కర కాలంలో.. ప్రమాదాల్లో.. రైతన్న ఉద్యమాల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తూ అజయ్‌కుమార్ ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి మహాసభ ఆమోదం తెలిపింది. ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించింది. కార్యకలాపాల నివేదికపై ప్రతినిధులు జిల్లాలవారీ గ్రూపు చర్చలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి తమ ఉద్యమ అనుభవాలను వివరించారు. 27 జిల్లాల కార్మిక ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపి కార్యదర్శి నివేదికకు ఆమోదం తెలిపారు. ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు, కార్మిక సమస్యలతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ సాధించిన ఫలితాలను వివిధ జిల్లాల ప్రతినిధులు మహాసభ ముందుంచారు.

గ్రూపు చర్చల్లో జిల్లా నేతలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె.రాజారామ్మోహన్‌రాయ్

మరో ఐదుగురు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కె.రాజారామ్మోహన్‌రాయ్ ఎన్నికయ్యారు. ఈయనతోపాటు మరో ఐదుగురు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కమిటీ సభ్యులుగా జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, పి.దక్షిణామూర్తి ఎన్నికయ్యారు.

సేవలందించిన 200 మంది వాలంటీర్లు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో మూడు రోజులపాటు జరిగిన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో 200 మంది వివిధ రంగాలకు చెందిన కార్మికులు అనేక రకాల సేవలందించారు. మహాసభ తేదీలు ప్రకటించినప్పటి నుంచి పట్టణంలో గోడ రాతలు, తోరణాల అలంకరణలు, ఫ్లెక్సీ బ్యానర్లు, భారీ స్వాగత కటౌట్ల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. ప్రతినిధుల సభకు వచ్చిన వారికి అల్పాహారం, భోజనం వడ్డించడంతోపాటు వారికీ ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా సేవలందించారు.

గోదావరి జిల్లాలు అంటే సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరయిన జిల్లాకు వచ్చిన అతిథులకు అతిథ్యం అందించడంలో వారికి ఎవరూ సాటిరారని చెబుతుంటారు. రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ప్రతినిధులకు సిఐటియు జిల్లా కమిటీ అందించిన అతిథ్యం ప్రతినిధులు ఉబ్బితబ్బిబయ్యారు.

ఉచిత వైద్య సేవలు

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతినిధులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

47 తీర్మానాలు ఆమోదం

మహాసభలో మొత్తం 47 అంశాలపై ప్రతినిధులు చర్చించి తీర్మానాలను ఆమోదించింది. కనీస వేతనాల అమలు, విశాఖ ఉక్కు అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ, చలో ఢిల్లీ, ప్రజాఉద్యమాలపై నిర్బంధాలను నిరసించడం వంటి తీర్మానాలను మహాసభ ఆమోదించింది. స్థానిక కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్లో సభ ఆమోదించిన తీర్మానాలపై రాష్ట్ర నేతలు వివరించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు పని చేస్తున్నారని, సమగ్ర చట్టాన్ని వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు , సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి సౌహార్ధ్ర సందేశాలిచ్చారు. జాతీయ నేతలు సాయిబాబు, ఆర్.లక్ష్మయ్య మాట్లాడారు. మహాసభ తీర్మానాలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించాలని కార్మిక ప్రతినిధులు ప్రతినబూనారు. చలో ఢిల్లీ, చలో అసెంబ్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని మహాసభ పిలుపునిచ్చింది.

మాట్లాడుతున్న గఫూర్

ఉమామహేశ్వరరావు

నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. పురపాలక సంఘ పరిధిలోని ఏడో వార్డులో ఉన్న మూడో సచివాలయాన్ని కలెక్టరు పి.ప్రశాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన సేవలందించాలన్నారు. సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రతీరోజు ఎన్ని అర్జీలు వస్తున్నాయి, వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని బియాండ్ ఎస్ఎల్ఎలో ఉన్నాయో సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ పౌర సేవలను విస్తతంగా అమలు చేసి ప్రజల నుంచి అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్‌ను క్షుణ్ణంగా కలెక్టరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, డిఇఒ ఆర్.వెంకటరమణ, తహశీల్దారు ఎస్ఎం.ఫాజిల్, ఎంపిడిఒ వైఎన్.శివప్రసాద్ యాదవ్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. నరసాపురం ఎస్ఎన్ఎస్ మున్సిపల్ హైస్కూల్లో నేడు పనులు బుధవారం కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. రెండో విడత నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫేజ్-1లో పూర్తయిన పనులు పరిశీలించి, మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. పనులు నాణ్యతతో ఉండాలన్నారు. ఈ పనులకు సంబంధించి ఇసుక, సిమెంటు తదితర సామగ్రి అందుబాటులో పెట్టుకుని భద్రపరచుకోవాలని ఆమె సూచించారు. పరిసరాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనంను కలెక్టరు రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్.వెంకట రమణ, తహశీల్దారు ఫాజిల్, ఎంపిడిఒ వైఎన్ఎస్.శివప్రసాద్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడంపై నిరసన

ప్రజాశక్తి - కాళ్ల

టిడిపి అధినేత చంద్రబాబు కుప్పం పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఉండి శాసనసభ్యుల మంతెన రామరాజు ఆధ్వర్యంలో పెదఅమిరంలో బుధవారం ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. జిఒ నెం.1ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొత్త నాగేంద్రకుమార్, టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల నాగేశ్వరావు, మోటుపల్లి రామవరప్రసాద్, కరిమేరక నాగరాజు, డిటి.కోటేశ్వరరాజు, ఆకివీడు టౌన్ అధ్యక్షులు బోళ్ల వెంకట్రావు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతిరాజ తిమ్మరాజు, గొంట్ల గణపతి, నరసాపురం పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు సాల మల్లేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అక్రమకట్టడాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఆమె పేరుపాలెం బీచ్‌ను ఆమె సందర్శించారు. అక్రమ కట్టడాలు తొలగించిన ప్రాంతాలను తహశీల్దార్ జి.అనితకుమారి, సబ్ కలెక్టర్ సూర్యతేజతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముత్యాలపల్లిలోని నాడు-నేడు పథకంలో జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

పెట్రోలు, పురుగుమందు డబ్బాలతో రైతుల నిరసన

ధాన్యం కొనుగోలు చేయాలంటూ డిమాండ్

ప్రజాశక్తి - కాళ్ల

తడిసిన, రంగుమారిన కొనుగోలులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు పురుగుమందు డబ్బాలతో బుధవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని సీసలి గ్రామంలో రైతులు ధాన్యం లోడు లారీతో రాష్ట్రీయ రహదారిపై పురుగు మందు డబ్బాలు, పెట్రోల్ సీసాలతో రాస్తారోకో చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వేగేశ్న శ్రీనివాసరాజు, పెద్దింటి జగన్మోహన్, పొట్నూరి శ్రీను, భలే కిచెన్ తదితరులు సుమారు 350 బస్తాల ధాన్యాన్ని లారీపై సీసలి గ్రామంలోని రైస్ మిల్లుకు ఐదు రోజుల క్రితం తీసుకొచ్చారు. అప్పటినుంచి రైస్‌మిల్ యాజమాన్యం ధాన్యం కొనుగోలు చేయడం లేదు. మిల్లు యజమాని ధాన్యం రంగు మారిందనే సాకుతో బస్తాకు వెయ్యి రూపాయలకు మించి ధర చెల్లించడానికి ముందుకు రావడం లేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుపై బైఠాయించి మద్దతు ధర చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ నిరసన దీక్ష చేపట్టారు. ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి సంఘటనాస్థలికి చేరుకుని నిరసన కార్యక్రమాన్ని రైస్‌మిల్ ఆవరణలో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని కోరారు.

రహదారిపై ఆందోళన చేపట్టిన రైతులు

తహశీల్దార్ టిఎ.కృష్ణారావుతో చర్చించిన తర్వాత రైస్ మిల్ ప్రాంగణంలో రైతులు, రైతు సంఘం ప్రతినిధులు బైఠాయించారు. మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతులకు మద్దతుగా ఎమ్మెల్యే మంతెన రామరాజు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు తిమ్మరాజు, నగేష్ రాజు, కాళ్ల మండల టిడిపి అధ్యక్షులు గుండాబత్తుల వెంకటనాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు బండారు వేణుగోపాలరావు నిరసన దీక్షలో కూర్చున్నారు.

ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన రైతుకు ప్రకృతి వైపరీత్యాలతో పంటలో కొంత రంగు మారినా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు నష్టం కలిగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న సమస్యలను పరిష్కరించకపోతే రైతు ఉద్యమాలు చేపట్టే అవకాశం ఉందన్నారు. బాధిత రైతులకు మేలు చేసేలా రైతు సంఘం ప్రతినిధులు తరలిరావడం అభినందనీయమన్నారు. రైస్ మిల్లర్‌తో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, తహశీల్దార్ కృష్ణారావు, ఎఒలు సిహెచ్.జయవాసుకి, ప్రియాంక, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తదితరులు చర్చించారు. లారీతో తీసుకొచ్చిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు అధికారులు అంగీకరించారు. లారీ వెయిటింగ్ ఛార్జీలో రూ.20 వేలు రైస్ మిల్లర్, మిగిలిన రూ.పదివేలు రైతులు భరించేలా ఒప్పందం చేశారు. తమకు న్యాయం జరగడంతో దీక్ష విరమించామని బాధిత రైతులు తెలిపారు.

శ్మశానవాటికల ఏర్పాటుకు భూ సేకరణ : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో శ్మశానవాటికల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు చర్యలు తీసుకోవాలని జెసి మురళీ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి పలు రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. శ్మశాన వాటికల ఏర్పాటుకు ఇప్పటికే గ్రామాల్లో గుర్తించిన భూమిని ఎస్‌సి సామాజిక తరగతి ప్రజలకు శ్మశాన వాటికల ఏర్పాటు నిమిత్తం పంచాయతీలకు తీర్మానాలను పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పేదల ఇళ్ల పట్టాల మంజూరుకు సంబంధించి కోర్టు కేసులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మల్టీపర్పస్ గోదాములు, ఎఎంసిల నిర్మాణాలకు అవసరమైన భూమిని త్వరితగతిన సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా కోపరేటివ్ అధికారి ఎం.రవికుమార్, సర్వే, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి మురళీ